కృష్ణ కృష్ణ హరే హరే..

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమి వేడుకలను సోమవారం అంతటా ఘనంగా నిర్వహించుకున్నారు. పలు పాఠశాలల్లో చిన్నారులు కృష్ణ, రాధ వేషధారణతో ఆకట్టుకున్నారు. ఉట్లు కొట్టి సంబరాలు చేసుకున్నారు. కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో ఉట్టి కొట్టారు. కొండాపూర్ శ్రీరాంనగర్‌లోని శ్రావ్య రెసిడెన్సీలో కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి. – గచ్చిబౌలి



సంస్కృతి హైస్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు







కమల ప్రసన్ననగర్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో వేడుకలు

ఆల్విన్‌కాలనీ: హరేకృష్ణ... హరేకృష్ణ... కృష్ణ కృష్ణ హరే హరే... నామస్మరణతో కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలు కృష్ణ నామ జపంతో మారుమోగాయి. కూకట్‌పల్లి కమలప్రసన్న నగర్ కాలనీలోని ఇస్కాన్ ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ కూకట్‌పల్లి శాఖ డైరెక్టర్ మహా శృంగదాస్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుక సందర్భంగా శ్రీ జగన్నాథ, బలభద్ర, సుభద్ర, శ్రీ రాధాకృష్ణ మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి గణపతి హోమంతో అంగరంగ వైభవంగా కార్యక్రమాలను ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణ, గోపికల వేషధారణలో సందడి చేశారు. చిన్నారులు కృష్ణ గీతాలాపనతో నృత్యాలు చేస్తూ అలరించారు.

ఎస్‌ఎస్‌డీ గ్రామర్ హైస్కూలులో..

ఆల్విన్‌కాలనీలోని ఎస్‌ఎస్‌డీ గ్రామర్ హైస్కూలులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్నేహం విలువను తెలియజేసే కృష్ణ, సుధాముని నాటకం, కృష్ణుని కొంటెతనం గురించిన నృత్య ప్రదర్శన ద్వారా వివరించారు. అనంతరం ఉట్టి కొట్టి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ రవీందర్‌రావు, సురభి దుర్గావాణి, చైర్మన్ చెన్నమనేని స్రవంతి, ప్రిన్సిపల్ సురభి తేజస్విని, వైస్ ప్రిన్సిపల్ జయశ్రీ, ఇన్‌చార్జీలు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.











శ్రావ్య రెసిడెన్సీలో కృష్ణుడు, రాధ వేషధారణలో చిన్నారులు



మియాపూర్‌లోని ద కెనరీ స్కూల్‌లో..





మూసాపేటలో...

మనూలో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని కమిషన్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ (సీఎస్‌టీటీ)అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ షాజాద్ అన్సారీ పేర్కొన్నారు. మనూ పొలిటికల్ సైన్స్ విభాగంలో కేంద్ర విద్యాశాఖ సీఎస్‌టీటీ సహకారంతో ఉర్దూ, తెలుగులో ద్విభాషా అభ్యాసకుల గ్లాసరీ ఆఫ్ పొలిటికల్ సైన్స్ అభివృద్ధిపై అయిదు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ షాజాద్ అన్సారీ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ఏ నాగేశ్వరరావు, డాక్టర్ ఖుర్షీద్‌ఆలమ్ ప్రసంగించారు. కార్యక్రమంలో కేంద్ర,రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలోని రానే ఇంజిన్ వాల్వ్ కంపెనీలో, మాదాపూర్‌లోని కాప్‌స్టన్ సర్వీస్ లిమిటెడ్ కంపెనీలో అదాలత్ ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సమస్యల పరిష్కారానికి సంబంధించి ఫిర్యాదులలో భాగంగా మంగళవారం నిధి ఆప్‌కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహించనున్నారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఏపీటీ పవర్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ,సంగారెడ్డిలోని పద్మావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, మెదక్‌లో బి.వీ రాజు ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో భవిష్యనిధికి సంబంధించి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాలలో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

గంటల తరబడి..

- మణికొండలో ట్రాఫిక్‌జాం
- పట్టించుకోని పోలీసులు
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సర్కిల్‌లో ట్రాఫిక్ జాం

మణికొండ: అసలే ఇరుకు రోడ్లు, దీనికితోడు గుంతమయం.. అక్కడక్కడ మరమ్మతు పనులు.. పెరిగిన వాహనాలతో నిత్యం మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని పలు కూడళ్ల వద్ద ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. మరో పది నిముషాల్లో వారివారి గమ్య స్థానాలకు చేరుకోవచ్చు అనుకున్న వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ గ్రామం వరకు రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధి, పుప్పాలగూడ గ్రామం సరిహద్దు నుంచి నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లకు వస్తుంది. కొన్ని రోడ్లు, కూడళ్లు.. వాటి పరిధిలో పోలీస్‌స్టేషన్లు మారుతుండటం.. ఇక రెండు పోలీస్‌స్టేషన్‌లకు ట్రాఫిక్ సిబ్బంది తగినంతగా లేకపోవటంతో మణికొండను నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయదుర్గం పోలీసులు మెహిదీపట్నం నుంచి గచ్చిబౌలి ప్రధాన రోడ్డు, నానక్‌రాంగూడ ఐటీ ప్రాంతానికే పెద్ద పీట వేసి మణికొండ ప్రభుత్వ పాఠశాల సర్కిల్‌కు ఒక హోంగార్డ్, లేదంటే కానిస్టేబుల్‌ను పంపి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వీఐపీ బందోబస్తు, ఇతర కార్యక్రమాలు ఉన్నపుడు ఆ ఒక్కరినీ పంపకపోవటంతో ఆ రోజు ప్రభుత్వ పాఠశాల సర్కిల్‌లో ప్రయాణికులు బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వారు ఆ కూడలి మాది కాదంటూ పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏకంగా అరగంట నుంచి రెండు గంటల పాటు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుంటున్నారు. ఇకనైనా ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్పందించి మణికొండలో ట్రాఫిక్ జాంలు ఏర్పడకుండా డైవర్షన్‌లు, వన్‌వేలు, సిగ్నళ్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన కార్యవర్గం



ఎమ్మెల్యే గాంధీని కలిసిన కాలనీ అసోసియేషన్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీ చక్రధరి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం ఎమ్మెల్యే గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సభ్యులను అభినందించారు. చక్రధరి కాలనీలో మౌలిక వసతులు కల్పించటానికి కృషి చేస్తానని, అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌రావు, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, ట్రెజరర్ శ్రీనివాస్, కమిటీ మెంబర్లు రామేశ్వరరావు, రమేష్, శ్రీధర్‌రెడ్డి, చిన్న శివయ్య, శ్రీనివాస్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చెత్త, వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

మియాపూర్: కాలనీ, రోడ్ల పక్కన చెత్తకుప్పలను, వ్యర్థాలను పారిశుద్ధ్య అధికారులు తొలగింపజేశారు. సోమవారం సాక్షి దినపత్రికలో ‘ఎటుచూసినా చెత్త కుప్పలు, వ్యర్థాలు’ అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి పారిశుద్ధ్య అధికారులు స్పందించారు. మియాపూర్ దీప్తిశ్రీనగర్, విశ్వేశ్వర కాలనీ, ఎంఏనగర్, శాంతినగర్ కాలనీలలో ఎస్‌ఆర్‌పీ కనకరాజు, మోహన్‌లు చెత్తకుప్పలను సిబ్బందితో తొలగింపచేశారు. చెత్త వేసిన ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. ఎవరైనా ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన చెత్త వేసినట్లయితే జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మియాపూర్‌లోని విశ్వేశ్వర కాలనీలో చెత్తను తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

నిరంతరాయంగా వెలుగుతున్నాయ్..

శేరిలింగంపల్లి: స్ట్రీట్ లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వీధిలైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగులు విరజిమ్ముతున్నాయి. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి పాపిరెడ్డి కాలనీ వరకు ప్రధాన రోడ్డులో స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జోనల్ కమిషనర్ స్ట్రీట్‌లైట్ల నిర్వహణపై వెంటనే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.





పాపిరెడ్డి కాలనీ ప్రధాన రోడ్డులో, చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద వెలుగుతున్న హైమాస్ట్ లైట్స్

ఫుట్‌పాత్‌లను తవ్వేస్తున్నారు..



మియాపూర్: లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లను తవ్వేస్తున్నారు. ఓ ప్రైవేటు సంస్థకు సంబంధించి 33కేవీ విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్ రోడ్డు పక్కన పనులు ప్రారంభించారు. ఈ స్తంభాల ఏర్పాటు కోసం ఫుట్‌పాత్ మధ్యలో గుంతలు తవ్వారు. దీంతో రోడ్డుపైనే నడవాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు. దీనిపై స్థానికులు జీహెచ్‌ఎంసీ అధికారి డీఈ దుర్గా ప్రసాద్‌కు ఫిర్యాదు చేయగా సిబ్బంది అక్కడికి చేరుకుని పనులను నిలిపివేయించారు. అనుమతులు తీసుకోకుండా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తీజ్ వేడుకలు

మియాపూర్: మియాపూర్ నడిగడ్డతండాలో తీజ్ వేడుకలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ వేడుకలకు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మన్నేపల్లి సాంబశివరావు, శంకర్, ఉదయ్ కిరణ్, రవిగౌడ్, హన్మంత్ నాయక్, రాజునాయక్, తండావాసులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



చందానగర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ ఫైవ్‌స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ శివ కుమార్ తెలిపారు. సోమవారం చందానగర్‌లో మణికంఠ ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ త్వరగా పూర్తి అవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని అన్నారు. 30 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల చొప్పున ప్రమాద బీమా బాండ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ అయ్యప్పరెడ్డి, డీలర్లు మల్లారెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

భెల్ ఎంఐజీ కాలనీలో బోనాల ఉత్సవాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలోని శ్రీ పోచమ్మ ఆలయంలో బోనాలు, ఫలహారం బండి ఊరేగింపును ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు జి.మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పోతరాజుల విన్యాసాలు, ఆటపాటలతో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ కౌన్సిలర్లు రవీందర్‌రావు, నాగమణి, మిరియాల రాఘవరావు, రఘునాధ్‌రెడ్డి, మంత్రిప్రగడ సత్యనారాయణరావు, శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



మార్తాండనగర్‌లో శాంతి ర్యాలీలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కోల్‌కతా వైద్యవిద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. కారకులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

మియాపూర్: ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ముళియ నాయక్ (45) మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివాసముంటూ కూలీ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ముళియనాయక్ గత రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసేసరికి ముళియనాయక్ మృతి చెంది ఉన్నాడు. దీంతో వారు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య కారణాలతోనే మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. మృతుడి అన్న కుమారుడు బసంత్‌జైన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గ్రామీణ విద్యార్థులకు ‘నవోదయం’

జేఎన్‌వీలో 6 నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య



రాయదుర్గం: నిరుపేద గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయం ఒక వరం లాంటిది. జేఎన్‌వీలో ప్రవేశం పొందితే 6 నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా, నాణ్యమైన విద్య అందుతుంది. చదువుతోపాటు ఇతర రంగాలలో కూడా రాణించేలా ప్రోత్సహిస్తారు. దేశవ్యాప్తంగా జిల్లాకు ఒకటి చొప్పున జేఎన్‌వీలున్నాయి. శేరిలింగంపల్లి పరిధి గోపన్‌పల్లిలోని రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన జేఎన్‌వీ 30 ఎకరాలలో ఉంది. ఐతే నేడు రంగారెడ్డి జిల్లాతో పాటు వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు కొత్తగా ఏర్పాటు చేయబడ్డాయి. ఆయా జిల్లాలకు కూడా ఈ కేంద్రమే కొనసాగుతోంది. దీంతో మూడు జిల్లాల విద్యార్థులకు సీట్లు సరిపోవడం లేదని అంటున్నారు. కాగా 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష దరఖాస్తునకు సెప్టెంబర్ 16 చివరి తేదీ కాగా జనవరి 18– 2025న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అర్హతలు.. ప్రవేశ పరీక్ష.. చివరి తేదీ.. సీట్లు

- జేఎన్‌వీలో 2025–26 ఏడాదికి 6వ తరగతిలో 80 సీట్ల కోసం అర్హత పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రస్తుతం ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివే వారు అర్హులు.
- దరఖాస్తునకు సెప్టెంబర్ 16 ఆఖరు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జనవరి 18న ఎంట్రన్స్ టెస్ట్
- గ్రామీణ ప్రాంత విద్యార్థులు రిజర్వేషన్ పొందాలంటే 3 ,4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో చదివి ఉండాలి.
- జేఎన్‌వీలో అధునాతన తరగతి గదులు, క్రీడామైదానం, కంప్యూటర్ బోధన, స్మార్ట్ ల్యాబ్స్ ఉన్నాయి. 6 నుంచి 12వ తరగతి వరకు కో ఎడ్యుకేషన్ ఉండగా బాలబాలికలకు వేర్వేరుగా వసతి ఉంది.

ప్రవేశ పరీక్షా విధానం

జేఎన్‌వీ 6తరగతి అర్హత పరీక్షకు ఆబ్జెక్టివ్ టైప్ క్వశ్చన్స్ మొత్తం 80 ప్రశ్నలకు 100 మార్కులు. ఇందులో మేధాశక్తి (మెంటల్ ఎబిలిటీ), గణితం (అర్థమెటిక్స్), భాషా పరిజ్ఞానం(లాంగ్వేజ్) ఉంటుంది. పరీక్షా సమయం 2 గంటలు ఉంటుంది.

జేఎన్‌వీలో రిజర్వేషన్ విధానం

ప్రస్తుత రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో 75 శాతం సీట్లు గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంత విద్యార్థులతో భర్తీ చేస్తారు.

- ఎస్సీలకు 15 శాతం , ఎస్టీలకు 7.5 శాతం , ఓబీసీలకు 27శాతం, బాలికలకు 1/3 వంతు సీట్లు, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు.



ఆధునిక సౌకర్యాలు.. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ



హైదరాబాద్ రీజియన్‌లో 77 జేఎన్‌వీలున్నాయి. వాటిల్లో అత్యాధునిక సౌకర్యాలు, నాణ్యమైన విద్య, క్రీడల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఉంటుంది. 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తుకు సెప్టెంబర్ 16 ఆఖరు. ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ పరీక్ష నిర్వహణకు ఒక్కొక్కరిపై వెయ్యి రూపాయల వ్యయం అవుతుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – గోపాలకృష్ణ, డిప్యూటీ కమిషనర్, నవోదయ విద్యాలయ సమితి, హైదరాబాద్ రీజియన్